క్లుప్తంగా

కనుల పండువగా కల్యాణోత్సవం



పద్మావతి, శ్రీనివాసుడి కల్యాణోత్సవ దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌ఓ ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పద్మావతి, శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం కనుల పండువలా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీవారి కల్యాణం కొనసాగింది. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రంగయ్య, నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కోశాధికారి సుధాకర్‌గుప్త, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



యర్రగుంట్లలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో శనివారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల సందర్భంగా యువతకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ గ్రామాల నుంచి 15 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన జట్లకు నిర్వాహకులు షీల్డు, నగదు బహుమతి అందజేశారు.

23న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

తాడిపత్రి: మండలంలోని జంబులపాడులో ఈ నెల 23న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వ తేదీ వరకూ వేడుకలు జరగనున్నాయి. 21న గణపతి పూజ, వేదపారాయణం, పుణ్యాహవాచకం తదితర పూజాకార్యక్రమాలు, 22న హోమాలు, సుదర్శన, శ్రీ సూక్త, పురుష సూక్త పారాయణ హోమం, మహా మంగళహారతి, తీర్థప్రసాదాల వినియోగం చేయనున్నారు. 23న పౌర్ణమి రోజు ఉదయం 7.45 గంటలకు పంచామృతస్థానాభిషేకం, వస్త్ర, పుష్ప అలంకారం అనంతరం 10.45 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరి

గుత్తి: పట్టణంలోని గాంధీనగర్, చెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె కేంద్రాల్లోని రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం పౌష్టికాహారం నిల్వలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయాలు పాల్గొన్నారు.

ఓడిపోతున్నామనే దాడులు



మాట్లాడుతున్న ఐటి వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి

గుత్తి: ఎన్నికల్లో ఓడిపోతున్నామని తెలిసి జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. గుత్తిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని టీడీపీ అనేక కుట్రలు, కుంత్రాలు చేసిందన్నారు. పోలింగ్ రోజు మహిళలు, వృద్ధులు భారీగా తరలిరావడంతో, ఓడిపోతామని గ్రహించి వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. తాడిపత్రి, తిరుపతి, పల్నాడు, మాచర్ల తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై చివరకు ఎమ్మెల్యేలపై కూడా దాడులు చేశారన్నారు. జూన్ 4న వైఎస్సార్‌సీపీ గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేవేంద్ర, జ్ఞానేశ్వర్ రెడ్డి, హరినాథ్, కోటేశ్వరరావు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

జగజ్జననీ నమోస్తుతే..



తాడిపత్రిలో వజ్రాల చీర అలంకరణలో కన్యకాపరమేశ్వరి



తాడిపత్రిలో స్వర్ణరథంపై వాసవీమాత



గుంతకల్లులో అలంకరణలో వాసవీమాత



గుత్తిలో పూజలందుకుంటున్న అమ్మవారు



పామిడిలో అలంకరణలో వాసవీమాత

- వైభవంగా వాసవీ జయంతి వేడుకలు

తాడిపత్రి అర్బన్/గుంతకల్లు టౌన్/గుత్తి/పామిడి: జగజ్జననీ లోకపావనీ నమోస్తుతే అన్న అమ్మవారి నామస్మరణతో అమ్మవారిశాల ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. తాడిపత్రి పట్టణంలో ఆర్యవైశ్యులు, వాసవీ మహిళా మండలి సభ్యులు అమ్మవారి అభిషేకానికి 102 గోత్రాలు కలిగిన వైశ్య మహిళలు 102 కలశాల్లో తీర్థాన్ని నింపి మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మవారిశాల వరకూ శోభాయాత్ర నిర్వహించారు. కన్యకా పరమేశ్వరీ అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించిన అనంతరం ఆర్యవైశ్య సంఘం వారిచే గణపతి, రుద్ర, నవగ్రహ, మృత్యుంజయ, వాసవీదేవికి వాసవీ మూల మంత్రాలతో హోమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, మహామంగళారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు.

☛ గుంతకల్లు పట్టణ నడిబొడ్డున ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభించారు. మొదటిరోజు బిందె సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళామణులు కోదండరామస్వామి ఆలయం నుంచి కలశాలతో ఊరేగింపుగా వచ్చి మూలవివరాట్‌కు, బంగారు ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో గణపతి హోమం, మహామంగళహారతి, అన్నప్రసాద పంపిణీ తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపాజగదీష్, కమిటీ పెద్దలు, కులస్థులు, భక్తాదులు పాల్గొన్నారు.



పామిడిలో కలశాలతో ఊరేగింపు



పామిడిలో వాసవీమాత నగర ప్రదర్శన

☛ గుత్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో వాసవీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాసు దేవ శర్మ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, హోమాలు, మహిళా మండలి ఆధ్వర్యంలో కుంకుమార్చన వంటి కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి వాసవీ మాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, మహిళా మండలి అధ్యక్షురాలు ఉమాదేవి, పలువురు సభ్యులు, భక్తులు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు పాల్గొన్నారు.

☛ పామిడిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవీమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం వాసవీమాతా ఉత్సవ విగ్రహాన్ని నగర ప్రదర్శ గావించారు. మాతృమండలి సభ్యులు అమ్మవారి కలశాలను తలపై ఉంచి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు బీవీ రత్నమయ్య, కే సాయిప్రకాష్, కే విశ్వనాథ్, కవి కే నారాయణమూర్తి, శివరంగయ్య, నల్లయ్య, నాగార్జున, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గుత్తి వాసవీ ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



గుత్తిలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

అమ్మవారి నుదుటిని తాకిన సూర్యకిరణాలు



గుంతకల్లులో అమ్మవారి నుదుటిని తాకిన సూర్యకిరణాలు

వాసవీమాత జయంతి రోజున గుంతకల్లులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అద్భుతం చోటుచేసుకుంది. శనివారం ఉషోదయాన్నే అమ్మవారి నుదుటిని సూర్య కిరణాలు తాకాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రతి రైతుకూ సబ్సిడీ విత్తన వేరుశనగ



గుంతకల్లులో వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఏడీ స్వాతి

గుంతకల్లు రూరల్: అర్హులైన ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏడీ స్వాతి సూచించారు. స్థానిక మార్కెట్ యార్డులోని రైతు భరోసా కేంద్రంలో శనివారం వ్యవసాయశాఖ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. విత్తన పంపిణీలో భాగంగా చేపట్టాల్సిన రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై ఆమె సిబ్బందికి సలహాలు, సూచనలను ఇచ్చారు. విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, మొబైల్‌తో సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 24లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది రైతులకు కదిరి–6, కదిరి లేపాక్షి, టీసీజీఎస్ రకాల విత్తనాలను పంపిణీ చేస్తోందన్నారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో అందజేస్తున్న విత్తన వేరుశనగ కదిరి –6 రకం, టీసీజీఎస్ –1694 రకాల ఒక బ్యాగు (30 కిలోలు) ధర రూ.1140గా నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా కదిరి లేపాక్షి రకం ఒక బ్యాగు ధర రూ. 1,044తో నిర్ణయించిందన్నారు.

మొదటి రోజు 57 మంది రిజిస్ట్రేషన్

శింగనమల: మండలంలోని ఆర్బీకేలో శనివారం విత్తన వేరుశనగ కోసం రైతులు రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. ఆర్బీకేల్లో ఎంపీఈఓలు, ఎంపీహెచ్‌ఓలు రిజిస్ట్రేషన్ చేయడం మొదలు పెట్టినట్లు ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. మండలంలో 57 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.



శింగనమల ఆర్బీకేలో విత్తన వేరుశనగకు పేర్లు నమోదు చేయించుకుంటున్న రైతులు

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



శింగనమలలో పూజలందుకుంటున్న వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం

శింగనమల: శింగనమలలోని పాతమరువ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం విగ్రహాలకు అభిషేకం చేసి, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సంపత్ ఆచారి, ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ ఆచారి, సంఘం పెద్దలు, కులస్తులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం గ్రామస్తులు గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



గుంతకల్లులో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



గార్లదిన్నె మండలం యర్రగుంట్లలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవ దృశ్యం

ఆదర్శ పాఠశాల అదుర్స్..!



పుట్లూరు ఆదర్శ పాఠశాల



పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్

- ఎన్‌ఎంఎంఎస్, ట్రిబుల్ ఐటీ, ఆర్జీటీకి 75 మంది ఎంపిక
- క్రీడల్లోనూ సత్తా చాటుతున్న విద్యార్థులు

పుట్లూరు: కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా అధునాతన భవనాలు, ఆహ్లాదకర వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కూడిన పుట్లూరు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలు ఆదర్శానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి.

విద్యార్థులకు వరం

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఆదర్శ పాఠశాల వరంగా మారింది. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు సృజనాత్మక, పరిశీలనాత్మక పద్ధతులలో బోధన చేపడుతున్నారు. అలాగే చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, మెరుగైన ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. 2013లో ప్రారంభమైన ఈ పాఠశాలలో ప్రస్తుతం 6 నుంచి 12వ తరగతుల వరకూ 492 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పుట్లూరు మండలంతో పాటు తాడిపత్రి, పెద్దపప్పూరు, నార్పల, శింగనమల మండలాల నుంచి సైతం విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారు.

పది, ఇంటర్‌లో ప్రతిభ

పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులు 93 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా అందులో 15 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. అలాగే 579 మార్కులతో సాయికీర్తన, 571 మార్కులతో నవ్యకీర్తన టాపర్లుగా నిలిచారు. ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థుల్లో జ్యోత్స్న 420 (సీఈసీ) మార్కులు, మహిత 424 (బైపీసీ) మార్కులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల్లో ప్రవీణ్ 951 (ఎంపీసీ) మార్కులతో ఆదర్శ పాఠశాలలో టాపర్లుగా నిలిచారు.

ఎన్‌ఎంఎంఎస్, ట్రిబుల్ ఐటీ ఫలితాల్లో సత్తా

ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్, ట్రిబుల్ ఐటీ ఫలితాల్లో సైతం సత్తా చాటుతున్నారు. పాఠశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)కు 59 మంది ఎంపికయ్యారు. అలాగే ట్రిపుల్ ఐటీకి పాఠశాల నుంచి 21 మంది, ఆర్జీటీకి 17 మంది విద్యార్థులు ఎంపిక కావడం గమనార్హం.

క్రీడల్లోనూ..

విద్యతో పాటు క్రీడల్లో సైతం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. ఇప్పటి వరకు 15 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, చెస్, టెన్నీకాయిట్, వెయిట్‌లిఫ్టింగ్, తైక్వాండో, త్రోబాల్ తదితర క్రీడల్లో రాణిస్తున్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి



ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాం. ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను పాఠశాల విద్యార్థులు సాధించారు. ఇప్పటికే 6వ తరగతి ప్రవేశం కోసం రాత పరీక్షలను నిర్వహించాం. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ చేరడానికి ఈ నెల 22వ తేదీ వరకు గడువు ఉంది. – ఓబుళరెడ్డి, ప్రిన్సిపాల్

పొంగిన వాగులు, వంకలు



గుత్తిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద వర్షపు నీటిలో వాహనదారుల అవస్థలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. శనివారం ఏఓ సోమశేఖర్ మాట్లాడుతూ మండలంలో 60 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. కాగా ఖరీఫ్ పంట సాగుకు వర్షం అనుకూలంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గుత్తి: గుత్తిలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లపై రెండు అడుగుల మేర వర్షపు నీరు ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. ఇన్నాళ్లు ఎండ వేడిమితో ఇబ్బంది పడ్డ జనాలు వర్షంతో ఉపశమనం పొందారు. భారీ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

తాడిపత్రి టౌన్: తాడిపత్రి మండలంలో శుక్రవారం రాత్రి ఓమోస్తరు వర్షం కురిసింది. మండలంలో దాదాపుగా 4.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు శనివారం తెలిపారు. మండలంలోని సజ్జలదిన్నె, బుగ్గ, చుక్కలూరు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని వంకలు జోరుగా ప్రవహించాయి. అలాగే ఆయా గ్రామాల్లోని చెక్‌డ్యామ్‌లు పొంగిపొర్లాయి. వర్షం రాకతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేశారు. ఖరీఫ్ పంటల సాగుకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరమన్నారు. కాగా శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో మండలంలోని బుగ్గ సమీపంలో ఉన్న దేవరకోన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని జలపాతం పర్యాటకులను కనువిందు చేస్తోంది.



తాడిపత్రి సమీపంలో కనువిందు చేస్తున్న దేవరకోన జలపాతం

అర్హత కలిగిన ప్రతి రైతుకూ విత్తనం: ఏడీఏ

అనంతపురం అగ్రికల్చర్: అర్హత కలిగిన ప్రతి రైతుకూ రాయితీ విత్తనం అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి ఆదేశించారు. శనివారం స్థానిక డివిజన్ కార్యాలయంలో అనంతపురం, రాప్తాడు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, ఆత్మకూరు, కూడేరు మండలాల ఏఓలు, ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఏపీ సీడ్స్ ద్వారా ఆర్‌బీకేలకు నాణ్యమైన విత్తనం అందేలా పర్యవేక్షించాలన్నారు. వెంటనేరిజిస్ట్రేషన్లు చేపట్టాలన్నారు. ప్రస్తుతానికి డివిజన్‌కు 14,400 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారని.. అయితే బీకేఎస్, కూడేరు, ఆత్మకూరు, గార్లదిన్నె మండలాలకు అదనంగా 2 వేల క్వింటాళ్ల తెప్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విత్తన పంపిణీలో ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 40 శాతం రాయితీ పోనూ తమ వాటా కట్టిన రైతులకు ఈ నెల 24 నుంచి విత్తనకాయలు అందేలా చూడాలన్నారు. జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్ మెన్యూర్స్) అవసరమైన రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఆర్‌బీకే అసిస్టెంట్లను అప్రమత్తం చేసి ఎక్కడా ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా విత్తన పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వర్షాలు వస్తున్నందున రైతులను సాగుకు సమాయత్తం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు శశికళ, శేఖర్‌రెడ్డి, శ్యాంసుందరరెడ్డి, పి.సోమశేఖర్, సుచరిత, విజయకుమార్, ఏఈవోలు మురళి, సుజిత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఈఏపీసెట్‌లో తాడిపత్రి విద్యార్థుల ప్రతిభ



కె.హనీష్‌రెడ్డి



ఎస్.చక్రధర్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: తెలంగాణ ఈఏపీసెట్‌లో తాడిపత్రి విద్యార్థులు ప్రతిభ చూపారు. కె.హనీష్‌రెడ్డి 81వ ర్యాంకు, సంగటి చక్రధర్‌రెడ్డి 750వ ర్యాంకు సాధించారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన వెలసిన శనీశ్వరుడి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధాన అర్చకుడు బాబాస్వామి శనీశ్వరుడి మూలవిరాట్ ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమాభిషేకం అర్చనలు, తైలాభిషేకం పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



అలంకరణలో శనీశ్వరుడు